# కాకతీయ చిహ్నం తొలంగించరాదు: ఏలేటి

హైదరాబాద్, (**ప్రభాత సూర్యుడు**) : తెలంగాణ రాష్ట్ర చిహ్నంలో మార్పులు చేయాలని బీజేపీ పక్షనేత ఏలేటి మహేశ్వర్ అసెంబ్లీలో సూచించారు. చిహ్నంలో కాకతీయుల ఫొటో తీయడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. రాచరికపు చిహ్నాలను తొలగించాలని, ªS నుంచి ªTఉగా మార్చడంలో అభ్యంతరం లేదని ఏలేటి చెప్పారు. టెక్నికల్ ఛేంజ్ కాదు క్వాలిటేటివ్ ఛేంజ్ కావాలని ఆయన సూచించారు. ఏలేటి వ్యాఖ్యలకు మంత్రి శ్రీధర్ బాబు బదులిచ్చారు. ప్రజల అభిప్రాయం మేరకే మార్పులు ఉంటాయని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ కార్యాలయాలపై, బస్సులపై ఇప్పటికే ªSను ªTఉగా మార్చిన సంగతి తెలిసిందే. వాహనాల రిజిస్ట్రేషన్ కూడా ªT ఉ పేరుతో చేస్తున్న సంగతి తెలిసిందే.


RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews

https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్ : చెరుకు ఉపేందర్ | శనివారం | 3.8.2024

సంపుటి : 1 | సంచిక : 338 | పేజీలు : 4 | వెల : రూ. 5/-


# తెలంగాణ ఉద్యమంలో టీచర్లది క్రియాశీలక పాత్ర



తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ భవిష్యత్ ఎక్కడుందని ఈ క్షణం తనను అడిగితే వేలాది మంది ఉపాధ్యాయుల రూపంలో ఎల్బీ స్టేడియంలో ఉందని చెబుతానని అన్నారు.



హైదరాబాద్ (**ప్రభాత సూర్యుడు**) : తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ భవిష్యత్ ఎక్కడుందని ఈ క్షణం తనను అడిగితే వేలాది మంది ఉపాధ్యాయుల రూపంలో ఎల్బీ స్టేడియంలో ఉందని చెబుతానని అన్నారు. ఎల్బీ స్టేడియంలో శుక్రవారం నాడు 30 వేల మంది ఉపాధ్యాయులతో సీఎం రేవంత్ ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రులు వారి భవిష్యత్‌ను ఉపాధ్యాయుల చేతుల్లో పెట్టారని చెప్పారు. రాష్ట్రం వస్తే విద్యా విధానం బాగుపడుతుందనుకున్నాం.. ఉపాధ్యాయుల గౌరవం పెరుగుతుందనుకున్నామని చెప్పారు. ప్రొ.కోదండరాం, హరగోపాల్, చుక్కా రామయ్య లాంటి వాళ్లకు గొప్ప గౌరవం దక్కుతుందనుకున్నామని కానీ తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఏం జరిగిందో చూశామని అన్నారు. గత పాలకులు ఉపాధ్యాయులను ఏ విధంగా అవమానించారో చూశామని చెప్పారు. "ఈ బడ్జెట్‌లో విద్యకు 10శాతం కేటాయించాలని భావించాం. కానీ హామీల అమలు దృష్ట్యా 7.3శాతం అంటే రూ.21వేల కోట్లకు పైగా కేటాయించాం. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న 30వేల పాఠశాలల్లో.. 26లక్షల విద్యార్థులు చదువుకుంటున్నారు. 10వేల ప్రైవేట్ పాఠశాలల్లో.. 33 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.ప్రైవేట్ పాఠశాలల్లో మీకంటే గొప్ప టీచర్లున్నారా? మౌలిక సదుపాయాలు లేకపోవడమే ఇందుకు కారణం కావచ్చు. తెలంగాణలో ఉద్యోగుల పరిస్థితి ఉమ్మడి రాష్ట్రంలో కంటే దారుణంగా ఉంది.. ఇది కఠోర నిజం. టీచర్లు తేనెతుట్టె లాంటి వాళ్లు.. హాని చేయాలని చూస్తే తీనెటీగల్లా

మిగతా 2వ పేజీలో..



## అసెంబ్లీలో కేసీఆర్ లేకపోవడంతో కిక్కురాట్లేదు..!!

2లో

## రేవంత్ నీ పౌరుషం ఏమైంది

## బిఆర్ఎస్ అవినీతిపై కేసులేవీ..?



ఢిల్లీ (**ప్రభాత సూర్యుడు**) : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఇన్ని రోజులు జరగడం ప్రజాస్వామ్యానికి మంచిదని బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. గత పదేళ్లలో అసెంబ్లీ ఇలా జరగలేదని చెప్పారు. తమ పార్టీ ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డి అసెంబ్లీలో బాగా మాట్లాడుతున్నారని ప్రశంసించారు. శుక్రవారం నాడు ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో అరవింద్ మీడియాతో మాట్లాడుతూ.. రాద్ధాంతం

2లో



## తెలంగాణ మహిళ మంత్రి వీడియో మార్ఫింగ్... ఫిర్యాదు

హైదరాబాద్, (**ప్రభాత సూర్యుడు**) : రాను రాను సమాజంలో ఆడపిల్లలకు రక్షణ లేకుండా పోతోంది. యువతులపై లైంగిక వేధింపులే కాకుండా.. వారి ఫోటోలు, వీడియోలు మార్ఫింగ్ చేస్తూ దుర్మార్గానికి పాల్పడుతుంటారు కొందరు వ్యక్తులు. సామాన్య మహిళలే కాదు మంచి హోదా, పరపతి ఉన్న వారు కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పుడు ఏకంగా తెలంగాణ రాష్ట్ర మహిళ మంత్రిని సైతం వదలలేదు ఆగంతకులు. మంత్రి సీతక్కకు సంబంధించిన వీడియోను కొందరు ఆగంతకులు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వైరల్ చేశారు. వీడియోని మార్ఫింగ్ చేసి సౌండ్స్ మార్చి

2లో

## అగ్రికల్చర వర్సిటీలో హైకోర్టు వద్దు

- మరోచోట స్థలం కేటాయించాలి
- అసెంబ్లీలో కెటిఆర్ డిమాండ్



హైదరాబాద్, (**ప్రభాత సూర్యుడు**) : రాష్ట్రానికి సంబంధించి హైకోర్టు భవనం ఆధునికంగా కడుతామన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.. కానీ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వ విద్యాలయం స్థలంలో కాకుండా మరో చోట కట్టాలని కోరుతున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. ఇందుకోసం మరోచోట స్థలం కేటాయించాలన్నారు. శాసనసభలో సివిల్ కోర్టుల సవరణ బిల్లును శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా కేటీఆర్

మిగతా 2లో...



## 'ఎలక్టోరల్ బాండ్ల'పై సిట్ విచారణకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ (**ప్రభాత సూర్యుడు**) : ఎలక్టోరల్ బాండ్లపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందంతో విచారణ జరిపాలించాలని దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు శుక్రవారం తోసిపుచ్చింది. రాజకీయ పార్టీలు, కార్పొరేట్ దాతల మధ్య 'క్విడ్ ప్రో కో' జరిగిందంటూ వచ్చిన ఆరోపణలో సిట్ దర్యాప్తు జరిపించాలని రెండు స్వచ్ఛంద సంస్థలు దాఖలు చేసిన

మిగతా 2లో...



## హరీష్‌రావుని వదిలిపెట్టేది లేదు

## మైనంపల్లి హనుమంత రావు మాస్ వార్నింగ్

సిద్ధిపేటజిల్లా(**ప్రభాతసూర్యుడు**) : మాజీ మంత్రి హరీష్ రావునీ వదిలిపెట్టేది లేదని మైనం పల్లి హనుమంత రావు మాస్ వార్నిం గ్ ఇచ్చారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నాడు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తుముకుంట నర్సారెడ్డితో కలిసి మైనంపల్లి హనుమంత

2లో

# సంపాదకీయం

## రాజ్యాంగ ఉల్లంఘనలకు తెరపడుతుందా?

మూడున్నర, నాలుగు మాసాల్లో పదవీ విరమణ చేయబోతున్న భారత ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ రెండు కీలకమైన వివాదాలను విచారణకు చేపట్టారు. ఇందులో ఒకటి- రాజ్యాంగం ఆర్టికల్ 110 దుర్వినియోగంపై దాఖలైన పిటిషన్లను ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనానికి నివేదించాలని తీసుకున్న నిర్ణయం. రెండవది రాష్ట్రాల గవర్నర్లకు కోర్టు కేసుల నుంచి రక్షణ కల్పిస్తున్న రాజ్యాంగ అధికరణ 361ను సమీక్షించాలని సంకల్పించడం. ఎవరు అధికారంలోకి వచ్చినా రాజ్యాంగానికి లోబడి పాలించాలి. తాము మాత్రం ఇందుకు అతీతులమని బీజేపీ పాలకులు భావిస్తుంటారు. వివాదాస్పద బిల్లులను ద్రవ్య బిల్లుల (మనీ బిల్లు) మార్గంలో (ఆర్టికల్ 110 దారిలో) ఆమోదింప చేసుకునే జబర్దస్తీ పద్ధతిని బీజేపీ పాలకులు ఎంచుకొని చాలాకాలమైంది. ఆధార్ కార్డు బిల్లుకు ఈ విధంగానే పార్లమెంట్ అనుమతిని సాధించారు. అయితే ఇది ఇప్పుడు వివాదంలో కూరుకున్నది. మనీ బిల్లు లేదా ఆర్టికల్ 110 నిజానికి ప్రభుత్వ ధనసేకరణ, ఖర్చులకు మాత్రమే పరిమితమైనది. ఈ మనీ బిల్లు రాష్ట్రపతి, స్పీకర్ అదుపాజ్ఞలలో కేవలం లోక్‌సభ ఆమో దంతో శాసన రూపం ధరిస్తుంది. ఈ అంశాలతో ఏ మాత్రం సంబంధం లేని వివాదాస్పద ఆధార్ బిల్లును మనీ బిల్లుగా పరిగణింపజేసి చట్టం చేయించుకోడం రాజ్యాంగానికి తీవ్ర అపరాధం. బీజేపీకి రాజ్యసభలో ఇప్పటికీ మెజారిటీ సిద్ధించలేదు. అందుచేత మనీ బిల్లు మార్గాన్ని మళ్ళీ దుర్వినియోగం చేయగలరనే భయాలు కొనసాగుతున్నాయి. 202-25 కేంద్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్నందున మనీ బిల్లు మార్గం మళ్ళీ దురుప యోగం కావొచ్చుననే భయాన్ని వ్యక్తం చేస్తూ ఇటీవల సీనియర్ అడ్వకేట్లు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వి, ఇందిరా జైసింగ్‌లు సిజెఐని ఆశ్రయించారు. ఆధార్‌ను ఆసరా చేసుకొని పంపిణీ చేస్తున్న సబ్సిడీలు సంఘటిత నిధి నుంచి తీసుకొంటున్నందున ఆధార్ బిల్లు మనీ బిల్లు కిందికే వస్తుందని కేంద్రం బుకాయించింది. అయితే ఆధార్ బిల్లుకు మనీ బిల్లు హోదా కల్పించి చట్టం చేయించుకోడాన్ని 4-1 మెజారిటీ తీర్పుతో 2018లో సుప్రీంకోర్టు ధ్రువీకరించింది. అసమ్మతి తీర్పు చెప్పిన ఏకైక న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ దానిని రాజ్యాంగ విరుద్ధ చర్యగా పేర్కొన్నారు. ఆధార్ బిల్లులో మన స్వేచ్ఛలను అరికట్టే అంశాలు న్నాయని అన్నారు. సాధారణ బిల్లును మనీ బిల్లు మార్గంలో చట్టం చేయించుకోడం శాసన నిర్మాణంలో రాజ్యసభ పాత్రను పరిమితం చేయడ మే అవుతుందనీ పేర్కొన్నారు. వాస్తవానికి ఈ వివాదంపై ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం సిఫార్సు మేరకు ఏడుగురు జడ్జీల ధర్మాసనం నియామక నిర్ణయం ఎప్పుడో జరిగిపోయింది. ఈ ముడిని పూర్తిగా విప్పే వైపుగా సిజెఐ హోదాలో చంద్రచూడ్ ఇప్పుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ పద్ధతిని సవాలు చేస్తున్న పిటిషన్లను రాజ్యాంగ ధర్మాసనం వచ్చే అక్టోబర్‌లో విచారణకు చేపడుతుందని ప్రకటించారు. చంద్రచూడ్ చేసిన ప్రకటనను కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జై రామ్ రమేష్ స్వాగతించారు. గత పదేళ్లలో చాలా బిల్లులను మనీ బిల్లుల పేరిట ఆర్టికల్ 110 ద్వారా బుల్డోజ్ చేశారన్నారు. వచ్చే నవంబర్‌లో తాను రిటైర్ అయ్యేలోగానే దీనిపై చంద్రచూడ్ స్పష్టమైన అంతిమతీర్పును ప్రకటించాలని జైరాం రమేష్ కోరారు. సుప్రీంకోర్టు నుంచి చంద్రచూడ్ ఇచ్చిన తీర్పుల్లో ప్రముఖమైనది వ్యక్తి గోప్యత హక్కుకు సంబంధించినది. ఇది రాజ్యాంగం హామీ ఇస్తున్న హక్కు అని, వ్యక్తికి వ్యక్తిగత గోప్యత హక్కు ద్వారానే ఆత్మ గౌరవం, స్వేచ్ఛ స్వాతంత్ర్యాలు లభిస్తాయని జస్టిస్ కెఎస్ పుట్టస్వామి, ఎఎన్అర్ వెర్సెస్ భారత యూనియన్ కేసులో స్పష్టం చేశారు. ఈ తీర్పు ఫ్యూడల్ సమాజ దుర్మార్గ విలువల పట్టును బద్దలు గొట్టి సమాజంలో వ్యక్తి గౌరవానికి పట్టం కట్టింది. ఈ తీర్పుతోనే తొమ్మిది మంది న్యాయమూర్తుల విస్తృత ధర్మాసనం పౌరుల వ్యక్తిగత గోప్యతా హక్కును రాజ్యాంగం 21 అధికరణ కింద ప్రాథమిక హక్కుల్లో చేర్చింది. పరస్పర సమ్మతితో సాగే స్వలింగ సంపర్కానికి ఆమోద ముద్ర వేసి మానవ సంబంధాల్లో విప్లవాత్మక మార్పును చంద్రచూడ్ ఆవిష్కరించారు. బ్రిటీష్ హయాంలో శిక్షాస్మృతిలో చేర్చిన 377 సెక్షన్ కోరలను పెకిలిం చారు. స్వలింగ సంపర్క హక్కును నిరాకరించడం వ్యక్తి గోప్యత హక్కును ఉల్లంఘించ డమేనని స్పష్టం చేశారు. సైన్యంలో మహిళలకు పురుషులతో సమానంగా పూర్తి స్థాయి సైనిక బాధ్యతలు అప్పగించాలని ఇచ్చిన మరో తీర్పు సైతం చరిత్రాత్మకమైనదే. ఇలా చంద్రచూడ్ తన పదవీకా లంలో న్యాయవ్యవస్థకు మరింత సునిశితమైన మానవీయ చూపును కల్పించారు. మహిళకు తన శరీరంపై పూర్తి అధికారం ఉండాలని చెబుతూ ఆమె తాను ధరించిన గర్భం వద్దనుకుంటే 20-24 వారాల పిండాన్ని కూడా తొలగింపజేసుకోవచ్చని తీర్పు ఇచ్చారు. ఎన్నికల ప్రక్రి యకు అపూర్వ స్థాయిలో కార్పొరేట్ ధన కాలుష్యాన్ని చేర్చిన ఎలక్టోరల్ బాండ్ల పద్ధతి గుట్టు రట్టు చేసి దానికి తెరదించారు. ఇప్పుడు మనీ బిల్లు మార్గం దురాక్రమణను కూడా అరికట్టిస్తారని చంద్రచూడ్‌పై ఆశలు పెట్టుకోడం సహజం. రాష్ట్రాల గవర్నర్లపై కేసులు పెట్టకుండా నిరోధిం చడం తగదంటూ దాఖలైన పిటిషన్ కూడా ఎంతో ముఖ్యమైనది. రాష్ట్రపతి, గవర్నర్లు పదవిలో ఉన్నంతకాలం వారిపై ఎటువంటి కోర్టు కేసులు పెట్టరాదని ఆర్టికల్ 361(2) నిర్దేశిస్తున్నది. గత పదేళ్లలో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల గవర్నర్లు ఇష్టావిలాసంగా రాజకీయ విమర్శలు చేసి అక్కడి ప్రభుత్వాలను ఇరకాటంలో పెట్టిన సంగతి తెలిసిందే. ఈ ధోరణి ఇంకా కొనసాగుతున్నది. ప్రతిపక్ష రాష్ట్రాల్లో ప్రభుత్వాలు శాసనసభలో ఆమోదింప జేసుకున్న బిల్లులకు మాసాలు, ఏళ్ల తరబడిగా ఆమోదం తెలపకుండా రాజ్‌భవన్‌లు కోల్డ్ స్టోరేజ్‌లో ఉంచాయి.

## అసెంబ్లీలో కేసీఆర్ లేకపోవడంతో కిక్కురాట్లేదు..!!

హైదరాబాద్ **(ప్రభాత సూర్యుడు) :** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అసెంబ్లీలో లేకపోవడం వల్ల తమకు కిక్కు రావడం లేదని కాంగ్రెస్ మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విమర్శించారు.

శుక్రవారం నాడు మీడియాతో ఆయన చిట్ చాట్ చేశారు. "కేసీఆర్ సభకు వస్తే మజా ఉంటుంది. కరెంట్‌పై డిస్కషన్‌లో కేసీఆర్ ఉండి ఉంటే ఇంకా బాగా జరిగేది. ఆయన ఓడిపోయిన ఇంకా జాతిపిత అనుకుంటున్నాడు. కేసీఆర్ ఊహల్లో బతుకుతుండు. పార్టీ మారితే రాజీనామా చేసి వెళ్లాలి. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ఎలా వెళ్తారు. మహిళ అని క్లయిమ్ చేస్తున్నప్పుడు గౌరవంగా ఉండాలి కదా. పార్టీ మారి ఉండాల్సింది కాదు. హౌస్‌లో సస్పెన్షన్‌లు చేయకపోవడం మా ప్లాన్. ఎల్ఓపీగా కేసీఆర్ సభకు రాకపోవడంతో ఆ పార్టీ నేతల పరిస్థితి తల్లి లేని పిల్లలుగా అనిపిస్తుంది. మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్ ఇద్దరిలో ఎవరికి ఎల్ఓపీ ఇచ్చిన బీఆర్ఎస్ ఆగం అవుతది. హరీష్‌రావు మంచి అనుభవం ఉన్న నేత కానీ ఆయనకు ఇవ్వరు. కేటీఆర్‌కు అవగాహన లేదు" అని రాజగోపాల్ రెడ్డి సంచలన విమర్శలు చేశారు.

## తెలంగాణ మహిళ మంత్రి వీడియో మార్ఫింగ్... ఫిర్యాదు

ఎక్స్ ఖాతాలో సదరు ఆగంతకులు సర్క్యులేట్ చేశారు. వారిపై చర్యలు తీసుకోవాలంటూ సైబర్ క్రైమ్ పోలీసులకు న్యాయవాది వెంకట నాయక్ ఫిర్యాదు చేశారు. అలానే మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో కూడా మార్ఫింగ్‌పై కూడా ఫిర్యాదు చేశారు. రెండు వీడియోలను సర్కులేట్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకో వాలంటూ వెంకట్ నాయక్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అడ్వకేట్ వెంకట నాయక్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఐటీఏ -2000-200, 79,33,(4),353(1) బీఎన్ఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**అసెంబ్లీలో చర్చ**

మరోవైపు మంత్రి సీతక్క వీడియో మార్ఫింగ్ అంశం తెలంగాణ అసెంబ్లీలో చర్చకు వచ్చింది. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. సభలో ఏదో వీడియో తీసుకుని ఇష్టారాజ్యంగా పోస్టు చేస్తున్నారని, పోలీసులు దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజన మహిళా మంత్రిపై ఇలాంటి పోస్టులా అంటూ మండిపడ్డారు.

మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ... పార్లమెంట్, అసెంబ్లీలో ఫోటోలు తీయడం నేరమని.. దీనిపై కచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు. సీతక్క మీద తప్పుడు ట్రోలింగ్ చేస్తే చర్యలు తీసుకోవద్దా... ప్రతిపక్ష సభ్యులు చర్యలు తీసుకోవద్దు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యలు చేశారు. చివరగా దీనిపై స్పందించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.. ఫోటో మార్ఫింగ్‌పై విచారణ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## తెలంగాణ ఉద్యమంలో టీచర్లది క్రియాశీలక పాత్ర

ఎదురుదాడికి దిగుతారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు నమ్మకం కలిగించేందుకు ప్రతీ నెలా 1వ తేదీనే జీతాలు అందించేలా చర్యలు తీసుకున్నాం. పదిహేనేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల ప్రమోషన్ల అంశాన్ని పరిష్కరించాం. మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశాం" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. "తెలంగాణ భవిష్యత్ మా చేతుల్లో కాదు.. మీ చేతుల్లో ఉందని చెప్పేందుకే ఈ సమావేశం. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే నేను ఈ స్థాయికి చేరా. అలాంటి ప్రభుత్వ టీచర్లను కలుసుకునేందుకే ఈ ఆత్మీయ సమావేశం. టీచర్లంతా 90శాతం పైగా నిబద్ధతతో పనిచేయాలి.. విద్యార్థులకు విద్యనందించాలి. గత ఏడాదికంటే ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో 2లక్షలకు పైగా విద్యార్థుల అడ్మిషన్లు తగ్గాయి. ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లడం ఆత్మగౌరవమని భావించేలా పాఠశాలలను తీర్చిదిద్దాలి. ప్రభుత్వం వైపు నుంచి మీ సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు మాకు ఎలాంటి భేషజాలు లేవు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు స్వయం సహాయక మహిళా సంఘాలకు బాధ్యత అప్పగించాం. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో మహిళలకు బాధ్యత అప్పగించాం. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించాలని అధికారులను ఆదేశించాం. తెలంగాణ బలపడాలి అంటే మనందరం కార్యదీక్షతో పనిచేయాలి. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టనుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి మండల కేంద్రాల్లో మినీ స్టేడియంల ఏర్పాటుకు ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. నైపుణ్యం లేకపోవడం వల్లే నిరుద్యోగం పెరుగుతోంది. అందుకే ముచ్చర్లలో 50 ఎకరాల్లో రూ.150 కోట్లతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేసుకున్నాం. స్కిల్ యూనివర్సిటీలో యువకులకు నైపుణ్యంతో పాటు ఉద్యోగ, ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. క్రీడలను ప్రోత్సహించేందుకు స్పోర్ట్స్ పాలసీని తీసుకొస్తాం. మీరు నేర్పే విద్యనే రేపటి తెలంగాణ భవిష్యత్‌కు బాటలు వేస్తుంది. పేద విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే మీ లక్ష్యం కావాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## హరీష్‌రావుని వదిలిపెట్టేది లేదు.. మైనంపల్లి హనుమంత రావు మాస్ వార్నింగ్

రావు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జులు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్ రెడ్డి పార్టీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ... తాను వారానికోసారి సిద్దిపేటలో పర్యటిస్తానని, ప్రతి గ్రామంలో తిరుగుతానని చెప్పారు. నియోజకవర్గానికి పూర్తి సమయం కేటాయిస్తానని తెలిపారు. లోకల్ బాడి ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులను గెలిపిస్తామని అన్నారు. గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వ వక్ఫ్ బోర్డు భూములను అమ్ముకుని లక్షల కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. ఆగస్టు లోనే రూ.2లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామని అన్నారు. ఇప్పటికే రెండు విడతలు రుణమాఫీని రైతుల ఖాతాల్లో వేసినట్లు గుర్తుచేశారు. ఈ విషయంపై హరీష్‌రావు రాజీనామాకు కట్టుబడి ఉండాలని సవాల్ విసిరారు. హరీష్ రావు నీ తిరిగి తోటపల్లికి పంపే వరకు తాను నిద్ర పోనని హెచ్చరించారు. రుణమాఫీ చేసినట్టు మిగిలిన పథకాలను కూడా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తారని చెప్పారు. గత కేసీఆర్ ప్రభుత్వం చింతమడకలో ఇష్టం వచ్చినట్లుగా రూ.10లక్షలు పంచిందని.. మరీ మిగతా గ్రామాల్లో ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సిద్దిపేట తరహాలో మిగతా నియోజక వర్గాలను అభివృద్ధి చేస్తామని మైనంపల్లి హనుమంత రావు పేర్కొన్నారు.

## అగ్రికల్చర వర్సిటీలో హైకోర్టు వద్దు

మాట్లాడుతూ.. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వ్యవసాయ భూముల్లో హైకోర్టు భవనం నిర్మించొద్దని యూనివర్సిటీ విద్యార్థులు నెల రోజుల పాటు ఆందోళన చేశారు. వ్యవసాయ విద్యాలయంలో పరిశోధనల తో ఫీల్డ్ ఎక్సపరిమెంట్ పరిశోధనలు జరగాలి. ఆ పరిశోధనలకు భూమి అవసరం. రాష్ట్ర రైతంగానికి ఉపయోగపడే విధంగా కొత్త వంగడాలు తీసుకురావాలి. కాబట్టి వ్యవసాయ పరిశోధనలు జరగాల్సిన యూనివర్సిటి భూములను తీసుకోవద్దని కోరుతున్నట్లు వెల్లడించారు. అగ్రికల్చర్ వర్సిటీకి చెందిన 100 ఎకరాలు తీసుకుంటామన్న ఆలోచన విరమించుకోవాలి. అక్కడ ప్రొఫెసర్లు, విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. మరో ప్రాంతంలో హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరుతున్నాను అని కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్ర చట్టాల విషయంలో కర్ణాటక, పశ్చిమ బెంగాల్, తమిళనాడు సీఎంలు ముగ్గురు కూడా తమ తమ రాష్ట్రాల్లో సవరణలు తీసుకోస్తామన్నారు. ఈ చట్టాల ప్రకారం ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా నిరాహార దీక్ష చేయడం కూడా నేరం. గతంలో మీ పార్టీ వారు చాలా సార్లు చేశారు. కాబట్టి ఇబ్బందులు జరుగుతాయి. ప్రజాస్వామ్యంలో ప్రజల తరపున ప్రతిపక్షాలు నిరసనలు చేయడం పరిపాటి. కాబట్టి మీరు సవరణలు తీసుకోస్తారో లేదో చెప్పాలని కేటీఆర్ ప్రశ్నించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌర హక్కుల సంఘం వారు సభ పెట్టుకుంటామంటే పోలీసులు అనుమతి ఇవ్వడం లేదు. ఏ చట్టం ఉపయోగించి నిరాకరించరో తెలియడం లేదు. అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే డిలీట్ చేయమని ఒత్తిళ్లు వస్తున్నాయి. అనధికారిక ఒత్తిడి, బలప్రయోగం చేయడం సరికాదు. దీన్ని కూడా ప్రభుత్వం ఆలోచించాలి. చట్టాలను దుర్వినియోగం చేసే పరిస్థితి రాకూడదన్నారు కేటీఆర్.

## 'ఎలక్టోరల్ బాండ్ల'పై సిట్ విచారణకు సుప్రీం నిరాకరణ

ప్రజాప్రయోజనాల వ్యాజ్యాన్ని సర్వోన్నత న్యాయస్థానం విచారించింది. సాధారణ చట్టం కింద చర్యలు తీసుకునే మార్గాలు ఉన్నందున దీనిపై మాజీ న్యాయమూర్తితో విచారణకు ఆదేశించడం సరికాదని, ఆర్టికల్ 32 కింద ఈ దశలో జోక్యం చేసుకోలేమని సీజెఐ డీవై చంద్రచూడ్ సారథ్యంలోని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. సిట్ విచారణకు నిరాకరించింది. రాజకీయ పార్టీలకు నిధులు సమకూర్చేందుకు తీసుకువచ్చిన ఎన్నికల బాండ్ల చెల్లుబాటుపై సుప్రీంకోర్టు గత ఫిబ్రవరి 15న సంచలన తీర్పునిచ్చింది. ఈ పథకం రాజ్యాంగ విరుద్ధమని, సమాచార హక్కు చట్టం ఆర్టికల్ 19(1)ను ఉల్లం ఘించడమే అవుతుందని తీర్పు వెలువరించింది. బ్యాంకులు తక్షణమే ఎన్నికల బాండ్ల జారీని నిలిపివేయాలని ఆదేశించింది. ఇదే సమయంలో విరాళాలు ఇచ్చిన వారి పేర్లు రహస్యంగా ఉంచడం కూడా ఆదాయపు పన్ను చట్టాన్ని ఉల్లం ఘించడమనని పేర్కొంది. ఈ ఎన్నికల బాండ్ పథకం 2018లో అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీలు విరాళాల గురించి బహిర్గతం చేయనవసరం లేదని అందులో పేర్కొంది. ఈ పథకం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ఇటీవల తీర్పు వెలువరించడంతో పాటు కేంద్రానికి నోటీసులు పంపింది.

## రేవంత్ నీ పౌరుషం ఏమైంది

చేశారు కాబట్టే బీఆర్ఎస్ నేతలను అసెంబ్లీ నుంచి బయట పడేశారని చెప్పారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను బయటకు రాకుండా తన అన్న మాజీ మంత్రి కేటీఆర్ చూస్తున్నారని.. సీఎం రేవంత్ రెడ్డి అన్నారని గుర్తుచేశారు. తమ హైకమాండ్ కాళ్లు పట్టుకోవాల్సిన అవసరం ఏం లేదని తేల్చిచెప్పారు. 6 నెలల నుంచి కవిత జైల్లో ఉంది..రెండు కేసుల్లో అరెస్ట్ అయ్యిందని తెలిపారు. రేవంత్ రెడ్డిని గత ప్రభుత్వంలో చాలాసార్లు అరెస్ట్ చేశారు. కానీ గత ప్రభుత్వ అవినీతిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో రేవంత్ అధికారంలోకి వచ్చి 9 నెలలు అయ్యిందని చెప్పారు.

రాష్ట్రానికి చీడ పురుగులా బీఆర్ఎస్

"రేవంత్ పౌరుషం ఏమైంది.. గత ప్రభుత్వ అవినీతిపై దర్యాప్తు ఏమైంది. కమిషన్లు వేయడం కాదు.. మీ చిత్త శుద్ధి నిరుపించుకోండి. రాష్ట్రానికి చీడ పురుగులా బీఆర్ఎస్ ఉండేది..దాన్ని వదిలించుకున్నారు. గులాబీ పార్టీను భూస్థాపితం చేయాలి. బీఆర్ఎస్ సమాజానికి మంచిది కాదు. తెలంగాణ బీజేపీలో ఐక్యత ఉంది. రైతు రుణమాఫీపై డేటా తీసుకుని ఆ తర్వాత స్పందిస్తాం. రుణ మాఫీ ఒకటే కాదు ఆరు గ్యారెంటీల గురించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తాం. రైతులు, మహిళలు, యువకులు సీఎం రేవంత్‌ను విమర్శిస్తున్నారు" అని అరవింద్ అన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవ్య కాంత్



**కల్లూరు – ప్రభాత సూర్యుడు :** వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కల్లూరు మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవ్య కాంత్ సూచించారు. మండల పరిధిలోని ముగ్గు వెంకటాపురం గ్రామంలో శుక్రవారం సీజనల్ వ్యాధుల పట్ల అవగాహనా సదస్సు నిర్వహించారు. వర్షా కాలంలో అధికంగా ప్రభలే డెంగ్యూ వ్యాధి, ఇతర వ్యాధులపై అవగాహన కల్పించారు. మురుగు కాల్వలలో, నీటి నిలువ ప్రదేశాల్లో దోమల సంతతి పెరిగి సీజనల్ వ్యాధులు ఎక్కువగా వ్యాప్తి చెందుతాయని తెలిపారు. ప్రజలు ఇంటి చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా, పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాధులు రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను, వ్యాధులు వస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలను, అదేవిధంగా వ్యాధి లక్షణాలను వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిభిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీ విద్య, సిహెచ్ఓ రేవతి, సూపర్వైజర్ రామారావు, ఆరోగ్య కార్యకర్తలు సుశీల, ఆశ కార్యాకర్తలు సునీత, మీన తదితరులు పాల్గొన్నారు.

# మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి





**కల్లూరు – ప్రభాత సూర్యుడు** : సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని ప్రజలు తమ తమ పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆశ కార్యకర్తలు సూచించారు. మండల పరిధిలోని పేరువంచ గ్రామం 'ఫ్రైడే డ్రై డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా పంచాయితీలో డ్రైనేజీ కాల్వలు, వర్షపు, మురికి నీటి కుంటలు, వ్యర్థాల నిల్వల ప్రదేశాల్లో దోమలు, రోగాలు వ్యాపించకుండా నివారణ మందులను వెదజల్లారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు కామేశ్వరి, ప్రభావతి, రామతులసి, వెంకటనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఏ.పీ.ఎం.పి. ఏ. సర్వసభ్య సమావేశానికి ఎన్టీఆర్ జిల్లా ఎమ్మెల్యేలకు ఆహ్వానం

మైలవరం, (ప్రభాత సూర్యుడు) : ఆగస్టు ఈనెల 5వ తారీఖు మైలవరంలో జరుగునున్న ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఏ.పి.ఏం.పి. ఏ.) సర్వసభ్య సమావేశ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర సమాచార శాఖ మరియు పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారధి ముఖ్య అతిథిగా, విశిష్ట అతిథిగా పార్లమెంట్ సభ్యులు కేశినేని నాని హాజరు కానున్నారు. ఆత్మీయ అతిథిగా మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్ మరియు గౌరవ అతిథులుగా జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ ,నందిగామ శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ,, తిరువూరు శాసనసభ్యులు కొలికపుడి శ్రీనివాస్, ద్వారకా తిరుమల చైర్మన్ సుధాకర్ రావు లు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఆహ్వాన పత్రికలను రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శాఖమూరి మల్లికార్జునరావు నేతృత్వంలో ఏపీఎంపీఏ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ పసుపులేటి చైతన్య , జిల్లా ముఖ్య నాయకులు బొడ్డు విజయ్ ల పర్యవేక్షణలో జిల్లా ముఖ్య నాయకులు మెటికల శ్రీనివాస్ రావు, జరిగింది.

# పొంగిపొర్లుతున్న మురుగునీటి సమస్యల నివారణకు తక్షణ చర్యలు

## - హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్ బి డిప్యూటీ జనరల్ మేనేజర్ వి.రేణుక



**రాజేంద్రనగర్,** (ప్రభాత సూర్యుడు) : మైలార్ దేవ్ పల్లి డివిజన్ లోని వెంకటేశ్వరా కాలనీలో పొంగిపొర్లు తున్న మురుగునీటి సమస్య నివార ణకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు హైదరాబాద్ మెట్రో వాటర్ అండ్ సివరేజీ బోర్డు డిప్యూటీ జనరల్ మేనేజర్ వి. రేణుక చెప్పారు. గత రెండు నెలలుగా పొంగిపొర్లుతున్న డ్రైనేజీని అరికట్టడానికి ఇటీవల కాలం వరకు ఇక్కడ పని చేసి బదిలీ అయిన మేనేజర్ ఉత్సాహం చూపకపోవడం పట్ల ఆమె విస్మయం వ్యక్తం చేశారు. కొత్తగా మైలార్ దేవ్ పల్లి సెక్షన్ మేనేజర్ గా బాధ్యతలు స్వీకరించిన సయ్యద్ సాజీద్ అలి సమస్యను డిజిఎం దృష్టికి తీసుకు వెళ్లడంతో వెంటనే స్పందించిన ఆమె వెంకటేశ్వరా కానీ లో చర్యటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరా కాలనీలోని ఆదిత్యా స్కూల్ ముందు పొంగిపొర్లుతూ ఆ వెనుక వైపు ఉన్న ఓపెన్ ప్లాట్లలో మురుగు నీరు నిల్వ ఉన్న విషయాన్ని స్థానిక ప్రాంత ఇంచార్జి వినోద్ డిజిఎం దృష్టికి తీసుకువెళ్లారు. సగం మేర వేసి వదిలే సిన సీసీరోడ్డు కారణంగా కూడా పైప్ లైన్ వ్యవస్థ, మ్యాన్ హెూల్స్ అస్తవ్యస్థంగా మారడానికి కారణమని డిజిఎం రేణుక గుర్తించారు. దాంతో యుద్ధ ప్రాతిపధికన మురుగునీరు తరలింపుతోపాటు కూలిపోయిన, అస్తవ్యస్థంగా ఉన్న మ్యాన్ హెూల్స్ ల మరమత్తులు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పనులు ప్రారంభించే వరకు అక్కడే ఉండి సిబ్బందికి మురుగునీరు లీకేజీ కాకుండా ఓవర్ లోడ్ నివారిస్తూ పైప్ లైన్లు ఏ విధంగా అనుసంధానం చేస్తూ మ్యాన్ హెూల్స్ నిర్మించాలో సూచించారు. కాంట్రాక్టర్ చంద్రయతో పాటు వర్క్ ఇన్స్పెక్టర్ మహ్మద్ జియావుద్దీన్, సూపర్వైజర్ వినోధ్ ను ఆయా పనులు పూర్తి చేయాని ఆదేశించారు. ఈ సందర్భంగా డిజిఎం రేణుక మాట్లాడుతూ వర్షాలు భారీగా కుస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాని సూచించారు. మురుగునీరు, వర్షం నీరు నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. డ్రైనేజీ పైప్ లలో చేరే విధంగా వ్యర్థాలను వేయవద్దని సూచించారు. ప్లాస్టిక్ సంచులు, చిన్నారులకు ఉపయోగించే డైపర్లు, ఇతర కొన్ని రకాల వ్యర్థాలు డ్రైనేజీ పైప్ లైన్ ల లో చేరడంవల్ల మురుగునీరు సాఫీగా సాగక పొంగిపొర్లే సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు. మురుగు నీటి తరలింపు పైప్ లైన్ వ్యవస్థలో ఏర్పడే సమస్యలకు తక్షణ వరిష్కారం కోసం హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్ బి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. బస్తీల్లో నిర్మాణాలు చేసే వారు నిర్మాణ సామాగ్రి సమకూర్చుకునే ప్రయత్నంలో భారీ వాహనాలను తీసుకురావడం వల్ల మ్యాన్ హెూల్స్ దెబ్బతిని కుంగిపోతున్నట్లు గుర్తించడం జరిగింద న్నాడు. మ్యాన్ హెూల్స్ పైనుంచి భారీ వాహనాలు తీసుకువచ్చి కూలిపోయేలాగా చేసే వారి పై శాఖ పరంగా చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదని ఆమె హెచ్చరించారు.

# ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం

## - బొబ్బిళ్ళ పాటి బాబురావు కాంగ్రెస్ పార్టీ మధిర నియోజకవర్గ నాయకులు



**ఖమ్మం** (ప్రభాత సూర్యుడు) : మూడు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నటువంటి ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మధిర నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు బొబ్బిళ్ళ పాటి బాబురావు మనస్ఫూర్తిగా స్వాగతిస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి అప్పటి యూపీఏ ప్రభుత్వానికి నివేదించిన ఎస్సీ వర్గీకరణ కేసు సుప్రీంకోర్టులో పెండింగ్ ఉన్నందున అప్పటి యూపీఏ ప్రభుత్వం ఉషా మెహర కమిషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉషా మెహర కమిషన్ ఎస్సీ వర్గీకరణను సమర్ధించడంతోపాటు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తదుపరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వ తరపున సీనియర్ న్యాయవాది తో సమర్థవంతమైన వాదనను వినిపించడంతో సుప్రీంకోర్టు ఎస్సి వర్గీకరణ సమర్థించే విధంగా తీర్పునివ్వడం మాదిగ వర్గానికి ఉపశమనంగా భావించక తప్పద న్నారు. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణను అమలు చేసేందుకు తక్షణమే చర్యలు చేపట్టే విధంగా బాధ్యత తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి , ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క కి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కి , ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగకి, సుప్రీం కోర్టు న్యాయమూర్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. న్యాయం, ధర్మం, కోసం చేసిన పోరాటం ఫలించిందని అన్నారు. అన్యాయానికి గురైన వర్గాల వైపే న్యాయస్థానం నిలబడిందని తెలిపారు. భవిష్యత్తు తరాలకు ఈ తీర్పు ఆదర్శంగా ఉండి ఆత్మవిశ్వాసం అందిస్తుందని ఈ విజయంతో మాదిగ, ఉప కులాలు ముందడుగు వేస్తాయని అన్నారు. ఇది ఒక కులం విజయమో, మరో కులం అపజయమో కాదని అంబేద్కర్ సాధించిన రిజర్వేషన్ ఫలాలు అందరికీ పంచటమే ఈ తీర్పు ఉద్దేశ్యం అని పేర్కొన్నారు.

# సిపిఐ జనరల్ బాడీ సమావేశాన్ని జయ ప్రదం చేయండి : బాడిశ రాము




**కుక్కునూరు**(ప్రభాత సూర్యుడు) : 4తారీకు, ఆదివారం ఉదయం 10 గంటలకు ఏలూరు సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగే సిపిఐ జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి బాడిశ రాము ఆ పార్టీ కార్యకర్తలకు తెలియజేశారు. ఈసమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య హాజరవుతున్నారు కావున ఈ జనరల్ బాడీ సమావేశంలో పార్టీ నిర్మాణం ప్రజాసంఘాల నిర్మాణం భవిష్యత్తు కార్యాచరణ పై చర్చించడం జరుగుతుంది తప్పనిసరిగా ఈ సమావేశానికి మండల కార్యవర్గ సభ్యులు కౌన్సిల్ సభ్యులు శాఖ కార్యదర్శులు ప్రజాసంఘాల అధ్యక్ష కార్యదర్శులు హాజరై ఈ జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని బాడిస రాము కోరినారు.



# న్యాయవాది సురేష్ బాబుకు సిపిఐ సీనియర్ నేత పువ్వాడ నాగేశ్వరరావు ఘననివాళి

**భద్రాద్రి కొత్తగూడెం, (ప్రభాత సూర్యుడు) :** కొత్తగూడెం పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది వట్టికొండ సురేష్ బాబు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే-ఎమ్మెల్సి పువ్వాడ నాగేశ్వరరావు నివాళులర్పించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఏరియాలోని వట్టికొండ స్వగృహంలో మృతదేహంపై యెర్ర జెండాను, పూలమాలను ఉంచి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ వామపక్ష ఉద్యమ సహచరుడిగా సుదీర్ఘకాలం కలిసి పనిచేశామని, వామపక్ష భావాలతో పేద, బడుగు, బలహీనవర్గాల పక్షం వహించి అనేక పోరాటాలకు సురేష్ బాబు నాయకత్వం వహించారని, న్యాయవాదిగా పేదల పక్షం వహించి వారికి న్యాయం జరిగేలా కృషి చేశారన్నారు. నేటి తరం న్యాయవాదులకు సురేష్ బాబు మార్గదర్శకుడని, ఆదర్శమని కొనియాడారు. అసెంబ్లీ సమావేశాల్లో ఉన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సానుభూతిని, సురేష్ బాబు మృతిపట్ల సంతాపాన్ని ప్రకటించారు. పువ్వాడ వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, జిల్లా నాయకు వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, మాచర్ల శ్రీనివాస్, భాగం మాధవరావు, యూసుఫ్, బోయిన విజయ్ కుమార్, నేరెళ్ల రమేష్, దాసరి శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్ తదితరులు వున్నారు.

# ఖబడ్దార్ దానం నాగేందర్ మాటలు జాగ్రత్త

## - అసెంబ్లీ లో దానం నాగేందర్ మాట్లాడిన తీరును ఖండించిన సిద్దిపేట జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు రెడ్డి యాదగిరి



ప్రభాత సూర్యుడు – సిద్దిపేట **అర్బన్** : అసెంబ్లీ సాక్షిగా శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో దానం నాగేందర్ మాట్లాడిన తీరును బిఆర్ఎస్వి సిద్దిపేట జిల్లా అధ్యక్షులు రెడ్డి యాదగిరి తీర్వంగా ఖండించారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా దానం నాగేందర్ మాట్లాడం కాంగ్రెస్ నాయకుల దురంహకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. దానం వ్యాఖ్యలు కన్నతల్లుల, మహిళలు ఆత్మగౌరవాన్ని, హైదరాబాద్ ఇమేజ్ ను దెబ్బతీసేలా ఉన్నాయి ఆగ్రహం వ్యక్తం చేసారు. దానం మాట్లాడిన మాటలను వెనిక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని, లేనిచో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, అవసరమైతే బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో దానం ఇంటిని ముట్టడిస్తామని రెడ్డి యాదగిరి ఒక ప్రకటనలో హెచ్చరించారు.

# ఆస్తి తగాదాలే అంగన్వాడీ టీచర్ పై పెట్రోల్ దాడికి కారణం సిఐ మధు




**రాథోడ్,** (ప్రభాత సూర్యుడు) : మండల పరిధిలోని దెందుకూరు గ్రామంలో అంగన్వాడీ ఉపాధ్యాయులపై జరిగిన దాడి ఆస్తి తగాదాలే కారణమని సిఐ మధు తెలిపారు శుక్రవారం స్థానిక గ్రామీణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్రం ప్రకాష్ రావు కుటుంబానికి గతంలో నుంచి ఆస్తి తగాదాలు ఉన్నాయని చిన్న కుమారుడిని పొలం ఇవ్వకపోవడంతో ఆయన కొడుకు గుర్రం సాయికుమార్ తాతని తనకు పొలం ఇవ్వాలని అనేక సందర్భాల్లో అడిగిన ఇవ్వకపోవడంతో దానికి కారణం పెద్దమ్మ పెదనాన్న అని ఆలోచించి వారిపై దాడి చేయడం కోసం తెచ్చుకున్న పెట్రోల్ తో పెద్దమ్మ దాడి చేశాడని తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్ చేసి కోర్టులో హాజరపరిచామని తెలిపారు ఈ విలేకరుల సమావేశంలో గ్రామీణ ఎస్సై లక్ష్మీ భార్గవి ఉన్నారు.

# రోజుకు 2 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి , రవాణా సాధించాలి

## - 13.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించాలి
## -రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలి
## -ఏరియా జీఎంలకు సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశం




**భద్రాద్రి కొత్తగూడెం, (ప్రభాత సూర్యుడు) :** దక్షిణ భారత దేశ ఇంధన అవసరాలను పరిగణనలోకి తీసుకుంటూ థర్మల్ విద్యుత్ కేంద్రాల డిమాండ్ మేరకు తగినంత బొగ్గును సరఫరా చేయాల్సిన బాధ్యత సింగరేణిపై ఉందని దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నెలలో రోజుకు 2 లక్షల టన్నుల ఉత్పత్తి, రవాణా చేయాలని సంస్థ ఛైర్మన్,ఎండీ ఎన్.బలరామ్ ఏరియా జీఎంలను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ సింగరేణి భవన్ లో జరిగిన అన్ని ఏరియాల జనరల్ మేనేజర్ల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటి నాలుగు నెలల్లో 21.65 మిలియన్ టన్నుల ఉత్పత్తిని సాధించాల్సి ఉండగా.. 20.94 మిలియన్ టన్నుల మేరకు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించామని పేర్కొన్నారు. జులై నెలలో కురిసిన వర్షాల వల్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గిందని చెప్పారు. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో ప్రతీ రోజూ విలువైనదని ఈ ఏడాది నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని చేరుకోవడానికి రోజుకు 2 లక్షల టన్నుల ఉత్పత్తి, రవాణా జరిగేలా చూడాలని కోరారు. అలాగే 13.5 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించడానికి వీలుగా ఓబీ కాంట్రాక్టర్లతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ ఓబీ లక్ష్యాలపై ప్రణాళిక బద్ధంగా ముందుకు పోవాలన్నారు. ప్రస్తుతం అడపా దడపా వర్షాల వల్ల ఉత్పత్తికి కొంత ఆటకం అయినప్పటికీ గనుల్లో నిలిచి ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉత్పత్తికి విఘాతం లేకుండా చూడాలన్నారు. ఒక వైపు వర్షాకాలంలో కలిగిన లోటును భర్తీ చేసుకుంటూ ఈ నెలలో ఇచ్చిన లక్ష్యాలను కూడా దాటి ఓవర్ బర్డెన్ తొలగించాలని సూచించారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనలో రక్షణను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించొద్దని సీఎండీ ఎన్.బలరామ్ స్పష్టం చేశారు. భూ గర్భ గనుల్లో, అలాగే ఉపరితల గనుల్లోని పని ప్రదేశాల్లో అధికారులు, సూపర్వైజర్లు ఎప్పటికప్పుడూ తనిఖీలు చేయాలని ఆదేశించారు. రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉత్పత్తి సాధించాలని పేర్కొన్నారు. అలాగే ఉద్యోగులు కూడా రక్షణ సూత్రాలను పాటించాలని, స్వీయ రక్షణను మరవొద్దని, రక్షణ లేని పని ప్రదేశాలను గుర్తిస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో సంస్థ డైరెక్టర్ (ఈ అండ్ ఎం) డి సత్యనారాయణ రావు, డైరెక్టర్ (ఆపరేషన్స్, పర్సనల్) ఎన్ వి కె శ్రీనివాస్, డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) జి . వెంకటేశ్వర్ రెడ్డి, జీఎం (కోఆర్డినేషన్) జి.దేవేందర్, జీఎం (సి పి పి) జక్కం రమేశ్, జీఎం(సేఫ్టీ) సుభానీ, జీఎం(ఎంపీ) సుబ్బారావు, కార్పోరేట్ జీఎంలు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# జియో థర్మల్ క్షేత్రంగా మణుగూరు

**- అన్వేషణ, అభివృద్ధి పై కీలక త్రైపాక్షిక ఒప్పందం - గోదావరి జియో థర్మల్ ఎనర్జీ ప్రాజెక్ట్ - ఒప్పందంపై సంతకాలు చేసిన సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ఓఎన్జీసీ డైరెక్టర్ సుష్మా రావత్ , తెలంగాణ రెడ్కో జీఎం సత్య వరప్రసాద్ - దేశంలో అతి పెద్ద జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి క్షేత్రంగా మారనున్న మణుగూరు - ఇప్పటికే సింగరేణి 20 కిలోవాట్ పైలట్ ప్రాజెక్టు విజయవంతం**




**భద్రాద్రి కొత్తగూడెం, (ప్రభాత సూర్యుడు) :** మణుగూరుకు సమీపంలోని పగిడేరు వద్ద భూగర్భంలో విస్తారంగా ఉన్న భూతాప (జియో థర్మల్) క్షేత్రం అన్వేషణ, అభివృద్ధిపై సింగరేణి కాలరీస్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఓఎన్ జీసీ), తెలంగాణ రిన్యూవబుల్ ఎనర్జీ కార్పోరేషన్ డెవలప్మెంట్ కార్పోరేషన్(తెలంగాణ రెడ్కో) మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. శుక్రవారం సాయంత్రం సింగరేణి భవన్ లో జరిగిన కార్యక్రమంలో సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్, ఓ ఎన్ జీ సీ డైరెక్టర్ (ఎక్స్ ప్లోరేషన్) సుష్మా రావత్, తెలంగాణ రెడ్కో జీఎం సత్య వరప్రసాద్లు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ మణుగూరులో 122 మెగావాట్ల జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు అవకాశం ఉందని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా నివేదిక వెల్లడించిందన్నారు. సింగరేణి పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగం దిశగా ముందుకు వెళ్తోందని తెలిపారు. ఇప్పుడు అన్ని సంస్థలు కూడా వ్యాపార విస్తరణలో భాగంగా ఇతర సంస్థలతో కలిసి పనిచేస్తూ ముందుకు వెళ్తున్నాయని తెలిపారు. ఇందులో భాగంగానే మణుగూరులో జియో థర్మల్ క్షేత్ర అన్వేషణ లో ఓ ఎన్ జీ సీ, తెలంగాణ రెడ్కోతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు.

ఓ ఎన్ జీ సీ డైరెక్టర్ సుష్మా రావత్ మాట్లాడుతూ దేశంలో అతి పెద్ద జియో థర్మల్ క్షేత్రంగా మణుగూరు మారుతుందని పేర్కొన్నారు. ఇక్కడ జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తికి పూర్తి అనువైన వాతావరణం ఉందని, మరింత అన్వేషణ జరిగితే జియో థర్మల్ విద్యుత్ ఉత్పత్తే కాకుండా హీలియం వెలికితీసేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. ఇప్పటికే సింగరేణి, తెలంగాణ రెడ్కో సహకారంతో క్షేత్ర స్థాయి సర్వేలు చేసినట్లు తెలిపారు. తెలంగాణ రెడ్కో జీఎం సత్య వర ప్రసాద్ మాట్లాడుతూ క్లీన్ ఎనర్జీ ప్రోత్సాహం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అన్ని సంస్థలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. మణుగూరులో చేపట్టిన ఈ ప్రాజెక్టు విజయవంతం అయితే దేశంలోనే తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఒప్పందం ప్రకారం ప్రతిపాదిత గోదావరి జియో థర్మల్ ఎనర్జీ ప్రాజెక్ట్ లో కేంద్ర ప్రభుత్వ మహా రత్న సంస్థ అయిన ఓ ఎన్ జీ సీ వారు మణుగూరు ప్రాంతంలో జియో థర్మల్ విస్తరించి ఉన్న భూ అంతర్భాగంలో పరిశీలన, అన్వేషణ జరపడంతో పాటు, ఈ ప్రాంతంలో జియో థర్మల్ విద్యుత్తు ఉత్పాదన కేంద్రాల ఏర్పాటుకు గల అవకాశాలపై అధ్యయనం చేసి నివేదికను సమర్పిస్తుంది ఇప్పటికే రాష్ట్ర అటవీ శాఖ సహకారం కోరుతూ ఒక ఒప్పందం చేసుకోవడం జరిగింది. అలాగే తెలంగాణ రెడ్కో నోడల్ సంస్థగా వ్యవహరిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలు, చట్టబద్ధ సంస్థల నుంచి అనుమతులు పొందడానికి సహకారం అందిస్తుంది. సింగరేణి సంస్థ లాజిస్టికల్ సహకారం అందిస్తుంది. ఓ ఎన్ జీ సీ గత కొన్నేళ్లుగా మణుగూరులో చేస్తున్న అధ్యయనానికి సింగరేణి సహకరిస్తూ వస్తోంది. మణుగూరు ఏరియాలో ఇప్పటికే భూగర్భం నుండి ఉబికి వచ్చే వేడి నీటి తో విద్యుత్ ఉత్పాదన కోసం కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సహకారంతో సింగరేణి సంస్థ ప్రయోగాత్మకంగా 20 కిలోవాట్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ పైలెట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో ఈ ప్రాంతంలో జియోథర్మల్ విద్యుత్ ఉత్పదనకు గల అవకాశాలపై అధ్యయనం చేయాలని నిర్ణయించారు.

ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దేశంలో జియోథర్మల్ లో మణుగూరుకు అవకాశాలు ఎక్కువ ఈ సందర్భంగా మణుగూరు ప్రాంతంలో ఉన్న జియో థర్మల్ పై అధికారులు వివరిస్తూ దేశంలో ప్రధానంగా 10 భూతాప ప్రాంతాల్లో 381 భూతాప ప్రదేశాలను గుర్తించగా వీటిలో మణుగూరు భూతాప క్షేత్రం అత్యంత ఆశాజనకమైన, తగిన భూతాప సామర్థ్యం కలిగిన ప్రాంతంగా ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు.ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఇక్కడ భూమి లోపల భూతాప కేంద్ర విస్తరణ సహజ సిద్ధంగా ఉందని కనుక విద్యుత్తు ఉత్పాదనకు ఎక్కువఅవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో ఇతర భూతాప కేంద్రాలకు సరైన రవాణా సౌకర్యం లేదని, అయితే మణుగూరు, పగిడేరు ప్రాంతంలో ఇప్పటికే రవాణా సౌకర్యం అందుబాటులో ఉందని, కనుక ఇక్కడ ఎక్కువ భూతాప కేంద్ర బావులను ఏర్పాటు చేసుకోవడానికి అనువుగా ఉందని తెలిపారు.

## మున్సిపాలిటీలలో ఆస్తి పన్ను వసూళ్లు , శానిటేషన్ మెరుగుపరచాలి





**మచిలీపట్నం, (ప్రభాత సూర్యుడు) :** మున్సిపాలిటీలలో ఆస్తి పన్ను వసూళ్లు, శానిటేషన్ మెరుగుపరచాలని, పట్టణాభివృద్ధి పథకాల కింద చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో మినీ కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీరాజ్, పురపాలక పట్టణాభివృద్ధి కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్షించారు.జిల్లాలో మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు అన్ని మున్సిపాలిటీలలో ఆస్తి పన్ను వసూళ్లు మున్సిపాలిటీల వారీగా సమీక్షించారు. పట్టణాభివృద్ధికి సంబంధించి కేంద్ర రాష్ట్ర పథకాల కింద, అమృత్ స్కీం క్రింద చేపట్టిన పనుల పురోగతి సమీక్షించారు. ముఖ్యంగా వర్షాకాలం సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా డ్రైనేజీలలో సిల్ట్ తీయించడం, శానిటేషన్ డ్రైవ్ చేపట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో గ్రామ వార్డు సచివాలయాల పనితీరు సమీక్షించిన కలెక్టర్ సచివాలయాల్లో వివిధ అంశాల్లో ఫంక్షనరీస్ యొక్క విధులు, సచివాలయాల ద్వారా ప్రజలకు అందిస్తున్న ఆధార్ తదితర సేవలు గురించి ఆరా తీశారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో ఆనంద కుమార్, ు పాల్గొన్నారు.

## ఆగస్టు 5 తేదీతో ముగియనున్న జనసేన క్రియాశీలక సభ్యత్వాల కార్యక్రమం



**కుక్కునూరు, (ప్రభాత సూర్యుడు) :** జనసేన క్రియాశీలక సభ్యత్వాలు ఆగస్టు నెల 5 వ తేదీన ముగియనున్నాయని వేలేరుపాడు జనసేనా మండల అద్యక్షులు గణేషుల ఆదినారాయణ పేర్కొన్నారు.తన నివాసంలో జనసేన నాయకులతో ఏర్పాటు సమావేశంలో.ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి జనసేన కార్యకర్తలు ఎంతో కృషి చేశారని కోరుకుంటూ, ప్రతి ఒక్క జనసేన కార్యకర్త 500 రూపాయలు కట్టి సభ్యత్వం నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన ప్రధాన కార్యదర్శులు కొవ్వల క్రాంతి కుమార్, దేవిరెడ్డి సుధాకర్, బోద్దుల శివరామ్, వీరాస్వామి, మోహన్.తదితరులు పాల్గొన్నారు.


## కళాకారుల కుటుంబాలలో వెలుగులు నింపిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు




**రంగారెడ్డి జిల్లా, (ప్రభాత సూర్యుడు) :** తెలంగాణ ఉద్యమ సమయంలో కళాకారులు తమ ఆటల ద్వారా పాటల ద్వారా తెలంగాణ సాధనకు తమ వంతు సహకారం అందించారు. అలాంటి కళాకారుల జీవన స్థితిగతులు మెరుగుపడేందుకు ప్రభుత్వ ఉద్యోగులతో పాటు పి ఆర్ సి ని అమలుపరిచి కళాకారుల కుటుంబాల్లో వెలుగులు నింపిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, తెలంగాణా సాంస్కృతిక సారధి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ విజయ్ కుమార్ లకు రంగారెడ్డి జిల్లా సాంస్కృతిక సారధి కళాబృందాల కళాకారులందరి తరపున బృంద నాయకుడు అన్నిమల్లె అనిల్ కుమార్ పత్రికా ముఖంగా కృతజ్ఞతలను తెలియజేశారు.

## ఎస్సీ ఎస్టీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం

### గోగు వెంకట్ నారాయణ రెడ్డి



**కేశంపేట్, (ప్రభాత సూర్యుడు) :** ఎస్సీ ఎస్టీ వరీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని లేమామిడి గోగు వెంకట్ నారాయణరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పై అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు హర్షనీయమని తాము స్వాగతిస్తున్నామని గోగు వెంకట్ నారాయణ రెడ్డి తెలిపారు.ఆ తర్వాత కాలంలో వర్గీకరణ అంశం అనేక కోర్టులో విచారణకు వచ్చిందని చివరికి సుప్రీంకోర్టులో నిన్న జరిగిన ఏడుగురు జడ్జీల ధర్మాసనం వర్గీకరణ సబబేని ధృవీకరించిందని గోగు వెంకట్ నారాయణ రెడ్డి తెలిపారు.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215